# దొంగలు

చిలకలూరిపేటలో పని తెముల్చుకుని తిరుగుప్రయాణం కోసం నర్సరావుపేట రోడ్డు పక్కన నిలబడ్డాను. ఎట్టి పరిస్థితుల్లోనైనా ఉదయానికల్లా నల్గొండ చేరుకోవాలి. రేపు ఇన్విజిలేషన్ డ్యూటి ఉంది. అసలే మా ప్రిన్సిపాల్ చండశాసనుడు. వాడి తిట్లు వినడం కన్నా, కోపంతో ధుమధుమలాడేప్పుడు మరింత చండాలంగా మారే వాడి మొహం చూడటం కన్నా ఎలాగోలా తంటాలు పడి వూరు చేరుకోవటమే నయం.

సమయం రాత్రి తొమ్మిది గంటలు. రోడ్డుమీద జన సంచారం మెల్లగా పల్చబడ్తోంది. రెండుమూడు లారీల్ని ఆపి చూశాను. ప్రయోజనం లేదు. హిస్టరీ లెక్చరర్ని కదా. ఎంసెట్ వేలం వెర్రిలో నాలుగు రాళ్ళు వెనకేసుకునే సబ్జెక్ట్ కాదాయె. ముగ్గురు పిల్లలు ...బొటాబొటిగా సరిపోయే జీతం. లారీ ఎక్కితే నాలుగు రూపాయలైనా మిగుల్తాయన్న ఆశ.

మరో లారీ వస్తోంది. చేయి వూపాను ఆపమన్నట్లు ... బండి నా దగ్గరకంటా వచ్చాక స్లో అయింది. నేను ముందుకు కదలబోయేలోపల లారీ ఆపి, డ్రైవరే కిందికి దిగి నాకెదురొచ్చాడు.

"నమస్తే సార్! ఎలా ఉన్నారు? చాలా కాలమైంది మిమ్మల్ని చూసి" అన్నాడు.

విద్యుద్దీపాల వెలుగులో అతన్ని పోల్చుకోడానికి ప్రయత్నించా. గుర్తుకు రాలేదు.

నా మొహంలో కదలాడిన శూన్యం అర్థమైందనుకుంటాను. అతనే మరలా అన్నాడు "నన్ను గుర్తుపట్టలేదా సార్...నేను సార్ చలపతిని. పదేళ్ళ క్రితం మీ స్టూడెంట్ని. మీరేమీ మారలేదు సార్. అందుకే వెంటనే గుర్తుపట్టాను"

అప్పటికీ ఆ శాల్తీ ఎవరో గుర్తు రాలేదు. ఐనా మర్యాద కోసం "ఓ నువ్వా... బావున్నావా?" అన్నాను.

"ఏం బాగో సార్. డిగ్రీ తర్వాత కాళ్ళరిగేలా తిరిగినా ఉద్యోగాలు దొరకలా. అసలే బియ్యే... యింకా రెండు సబ్జెక్టులు మిగిల్నాయి. అందుకే లారీ డ్రైవర్‌గా సెటిలైపొయ్యా. యింతకీ ఎటెల్తున్నారు సార్"

నా పాత విద్యార్థి అని తెలిశాక ఐయేయస్సులూ, ఐపియస్సులే కాదు లారీ డ్రైవర్లలో కూడా నా విద్యార్థులున్నందుకు సంతోషపడి, "మన నల్గొండకే"అన్నాను.

"రండి సార్. లోడ్ హైద్రాబాద్‌కి చేర్చాలి. అదే దారిగా. మిమ్మల్ని నల్గొండలో డ్రాప్ చేస్తాను"

చలపతి లారీ డ్రైవ్ చేస్తున్నాడు. అతని పక్కనే కూచున్నా. మాతో పాటు క్యాబిన్‌లో మరో డ్రైవర్ ఉన్నాడు." ఇతని పేరు రాజు సార్. లాంగ్ జర్నీ కదా. కొంత సేపు నేను, మరికొంత సేపు రాజు మార్చి మార్చి బండి నడుపుతాం" అన్నాడు.

"బండి నీ స్వంతమేనా" అడిగాను.

"నా మొహానికంత సీనెక్కడుంది సారూ. ఈ లారీ ఓనరు హైద్రాబాద్‌లో ఉంటాడు. ఎనిమిదినెల్లయింది అక్కడ పనికి కుదుర్కొని. యింతకు ముందు ఓనరు జీతాలు సరిగ్గా ఇయ్యటం లేదని యిక్కడ జేరా. ఏం బతుకులో సార్ మావి. ఈడా అంతే. మూణ్ణెల్లనుంచి జీతాల్లేవు. పని మానేద్దామనుకుంటున్నా. వచ్చే శనోరం నా కూతురి పుట్టినోజుందనీ, డబ్బులెలాగైనా సర్దాల్సిందని ఓనరుతో గొడవ పెట్టుకుంటే ,ఇదో మద్రాసెల్లి లోడ్ వేసుకు రమ్మని పంపాడు. కిరాయి పది వేలు వసూలు చేసుకు వస్తున్నా. నాకు రావాల్సిన జీతం కింద ఈ కిరాయి ఉంచేసుకొమ్మన్నాడు" తన ప్యాంటు జేబుని కుడి చేత్తో తడుతూ చెప్పాడు.

నర్సరావుపేట చేరుకునేప్పటికి రాత్రి పదయింది. అక్కడో ప్యాసింజర్ని ఎక్కించుకున్నాడు. మాతో పాటు క్యాబిన్‌లో కూచున్న అతని వైపు పరిశీలనగా చూశాను. వయసు యాభై పైన ఉంటుంది. మొహంనిండా స్ఫోటకపు మచ్చలు

... గుబురు మీసాలు... పంచె కట్టు ... చేతిలో సంచి. చారల బనీను, గళ్ళ లుంగీ తొడిగితే సినిమాల్లో రౌడీ వేషాలకు సరిగ్గా సరిపోతాడు. దాచేపల్లి వెళ్ళాలని చెప్పాడు.

రాజు నిద్రొస్తుందంటూ పైకెక్కి పడుకున్నాడు.

నేనూ కొద్దిసేపు నిద్ర కోసం ప్రయత్నించా. ఎదురుగా వచ్చే బండ్ల లైటింగ్ సూటిగా కళ్ళల్లో గుచ్చుకుంటుంటే నిద్రెలా పడ్తుంది? మరలా చలపతితో పిచ్చాపాటిలో పడ్డా.

రాత్రి పన్నెండున్నర... పిడుగురాళ్ళ వూర్లో నలుగురు ముసల్మాన్లు ఎక్కారు. అందులో ఒకతని వయసు డెబ్బయికి అటూయిటుగా ఉంటుందేమో. బద్దలా పల్చటి శరీరం... పొడవాటి తెల్లటి గడ్డం... అతని మొహం చూస్తే ఐదు పూటలా క్రమం తప్పకుండా నమాజు చదివే వ్యక్తిలా అన్పించింది. మిగతా ముగ్గురూ యువకులు. వాళ్ళు పైకెక్కి, సరుకుమీద కప్పిన టార్పాలిన్ మీద సెటిలైనారు. ముసలతను మాతో పాటు క్యాబిన్‌లో కూచున్నాడు.

"ఎక్కడిదాకా సాయిబూ" అంటూ అతనితో మాట కలిపా.

"నల్గొండ ...అక్కడ మదరసాలో నా మనవడు సదూకుంటుండు. ఆడ్ని సూసి, సేతిలో కొద్దిగా పైసలు పెట్టొద్దామని"

"పైకెక్కారే ... ఆ ముగ్గురూ నీకేమవుతారు? కొడుకులా?"

"కాదు బేటా. కొడుకులకన్నా ఎక్కువే అనుకో. ఒకూరివాల్లం. సుతారీ పని సేస్తాం. నేను మేస్త్రీని. ఆల్లు ముగ్గురూ పదేళ్ళసంది నా కాడ పని సేస్తుండ్రు. లగ్గాలయ్యి బిడ్డలు పుట్టినా నన్నిడిసి పోలా. ఆల్ల పిల్లలూ గదే మదరసాలో సదూతుండ్రు."

"మీ పిల్లల్ని మదరసాల్లో చదివిస్తే ఉద్యోగాల వేటలో మిగతా పిల్లల్తో పోటీ పడగలరా చాచా? ఉర్దూ, అరబ్బీ యింటి దగ్గర నేర్పుతూ అందరితోపాటు యింగ్లీషు చదువులు చదివించొచ్చుగా"

"అసంటి సదువులు గరీబోల్లం మేం సెప్పించగలమా? కడుపుకింత రొట్టెముక్క దొరికిందే సాలనుకునే బతుకులాయె. మదరసాల గింత కూడైనా దొరుకుద్ది. అలీఫ్ బేలు నేర్సుకుంటే ఉరుదూ అయ్యోరిలా నౌకరీ సేయొచ్చు. ఖాజీ కావొచ్చు. గివేమీ కాకుంటే మా సుతారీ పని సూస్కుంటరు. అన్నిటికీ ఆ అల్లా ఉన్నడు"

అతని పేరు కాసిం అని చెప్పాడు. మాటల్లోనే వూరి బయటకొచ్చాం. పన్నెండేళ్ళ కుర్రాడు లారీ ఎక్కాడు. క్యాబిన్‌లో ఓ పక్కగా ఉన్న చెక్కస్టాండ్ మీద కూచున్నాడు.

"గింత రాత్తిల్ల ఎక్కడికెళ్ళొస్తున్నవు బేటా" అని అడిగాడు కాశిం.

"సెకండ్ షో సినిమాకెళ్ళా. తిరిగి మా వాడపల్లి వెళ్ళటానికి సరిపడా పైసల్లేవు. అందుకే నడిచొస్తున్నా"

"ఏం చదువుతున్నావు?" అని అడిగా.

"ఏడో తరగతి"

"ఏ సినిమాచూశావు"

"కర్తవ్యం"

"బావుందా"

"ఓ.. చాలా బావుంది. యిది నాలుగోసారి"

"అంత బాగా నచ్చిందా? ఏం నచ్చిందందులో... పాటలా... ఫైట్లా..."

"విజయశాంతి... ఏం యాక్షన్ చేసిందో... నేను బాగా చదువుకుని పోలీసునౌతా"

సినిమాలు పిల్లలమీద ఎంతటి బలమైన ప్రభావాన్ని చూపిస్తాయో కదా అన్పించింది. తన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వహించినట్టు చూపించటం వల్ల ఈ కుర్రోడికి భవిష్యత్తులో పోలీసు కావాలనే ఆశయం ఏర్పడింది. అదే నెగెటివ్

షేడ్ ఉన్న హీరో సినిమా చూసి ఉంటే...

నా వళ్ళు కొద్దిగా జలదరించింది ఇప్పుడు కుప్పలు తెప్పలుగా వస్తున్న యూత్ సినిమాలన్నీ దుర్గుణాల్ని గ్లామరైజ్ చేసేవే ఉన్నాయి. ఈ మధ్య వచ్చిన ఓ సినిమాలో హీరో పాల ప్యాకెట్ కోసం క్యూలో నిలబడటానికి బద్ధకించి, క్యూలో ఉన్న ఓ ముసలతన్ని బెదిరిస్తాడు 'నా పాల ప్యాకెట్ కూడా నువ్వే తీసుకురా. లేదంటే నీ కూతుర్ని అల్లరి చేస్తా. రేప్ చేస్తా' అంటాడు. క్యూలోని మరో వ్యక్తి 'నువ్వు రేప్ చేయటానికి నాకు కూతురే లేదు పోరా' అంటే 'నీ పెళ్ళాం ఉందిగా. దాన్ని రేప్ చేస్తా' అంటాడు. అదే హీరోయిజమనుకుని ఈ టీనేజ్ కుర్రాళ్ళంతా ఆ రౌడీ హీరోని ఆదర్శంగా తీసుకుంటే సమాజం ఏమైపోతుందో...

పెద్ద శబ్దంతో కీచుమంటూ లారీ ఆగిపోయింది.

"దీనమ్మ ... పంక్చరైనట్టుంది" చలపతి లారీ దిగాడు. నేనూ, నాతో పాటు మిగతావాళ్ళు కూడా దిగారు. ముందు చక్రాల్లో ఒకదానికి పంక్చరైంది.

సమయం ఒకటింపావు...

"యింకో పది కిలోమీటర్లు పోతే దాచేపల్లి వచ్చుండేది. అక్కడైతే పంక్చర్ వేయించుకునే వీలుంది. ఐనా పర్లేదు సార్. స్టెప్నీ ఉంది. మా రాజుగాడు బిగించేస్తాడు" అంటూ చుట్టూ చూశాడు.

"అరే రాజు... ఇక్కడెక్కడో దాబా ఉండాలి కదరా" అన్నాడు.

"జై అన్నా ... ఓ ఫర్లాంగు నడిస్తే చాలన్నా. ఎదురుగ్గా కన్పిస్తది"

"సరే. నువ్వు పని చూస్తో ఉండు. నీకు బిర్యాని పార్శెల్ తెస్తా " అంటూ చలపతి ముందుకు నడిచాడు.

"చాయ్ దొరుకుద్దా బేటా" కాసిం ప్రశ్నకు "అన్నీ దొర్కుతయ్" అంటూ రాజు సమాధానమిచ్చాడు.

అందరం దాబా చేరుకున్నాం. కాసిం, అతని సహచరులు ముగ్గురూ నిలబడే

చాయ్ తాగుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

"సార్. ఏమనుకోకండ్రి నేను బీర్ తాగుతా. కావాలంటే మీక్కూడా తెప్పిస్తా" అన్నాడు చలపతి.

"అనుకోడానికేముంది? నువ్వు తెప్పించుకో. నాకో వెజ్ మీల్స్ చెప్పు చాలు" అన్నాను. మాతో పాటు వచ్చిన కుర్రాడికోసం వెతికాను. నా డబ్బుల్తో కనీసం చాయ్ ఐనా ఇప్పిద్దామని... కాసిం పక్కన నిలబడి చాయ్ తాగుతున్నాడు. పేదవాడి మనసు పేదవాడికే అర్థమౌతుందేమో ననిపించింది. నేను కాసిం వైపు మెచ్చుకోలుగా చూసాను. "మేరా పోతా యైసాచ్ రహతా. బాగా సదూకో బేటా. అల్లా నీ ఖాయిష్ తీరుస్తడు. పోలీసైనక మనసుంటి గరీబోల్లని యాదుంచుకో" అంటున్నాడు కాసిం.

చలపతి రెండు బీర్లు తాగి, బిర్యాని తిన్నాడు. మరో బిర్యాని పొట్లం కట్టించుకుని వెనక్కి వెళ్ళేప్పటికి స్టెప్నీ బిగించటం పూర్తయింది.

"రాజూ ... బండి నువ్వు తోలు. నేను పైకెక్కి పడుకుంటా" అన్నాడు చలపతి. అతన్తోపాటు ముస్లిం యువకులు ముగ్గురూ పైకెక్కారు. లారీ బయల్దేరింది. మొదట ఎక్కిన గుబురు మీసాల ప్యాసింజర్ దాచేపల్లిలో దిగిపోయాడు.

మరో ఇరవై కిలోమీటర్లు దాటి ఉంటాం. నాకు మగతగా నిద్ర పడ్తోంది.

"ఒరేయ్ రాజూ ...బండి ఆపరా" చలపతి పెద్దగా కేకలు వేస్తున్నాడు.

అతని అరుపులకి మెలకువొచ్చింది.

"ఆపరా... బండిని పక్కకు తీసి ఆపు" చలపతి మాట ముద్దగా ఉంది.

రాజు బండిని ఆపి "ఏమైందన్నా" అని అడిగాడు.

చలపతి బండి దిగాడు.

విషయమేమిటో అర్థంకాక "ఏమైంది? ఏమైనా పీడకలొచ్చిందా" అని అడిగా.

"కల కాదు సార్. నిజం ... జేబులో పెట్టుకున్న డబ్బులు కన్పించటం లేదు.

పదివేలు సార్... అన్నీ వందరూపాయల నోట్లు... ఎవడో కాజేశాడు సార్" అన్నాడు.

విషయం తీవ్రమైనదని అర్థమైంది. తాగిన మైకంలో సరిగ్గా చూసుకునుండడు.

"చలపతీ ... కంగారు పడకు. నెమ్మదిగా వెదుకు" అన్నాను.

"నా జేబులన్నీ వెతికాను సార్. అమ్మ తోడు మనం దాబాకెళ్ళినపుడు డబ్బులు ప్యాంటు జేబులోనే ఉన్నాయి. నేను పడుకోడానికి పైకెళ్ళినపుడు కూడా తడిమి చూసుకున్నా. నాతోపాటు పైన పడుకున్న ఆ నాకొడుకులే దొంగిలించారు. ఒరేయ్ చెప్పండ్రా... నా డబ్బులెవరు తీశారో చెప్పండి" అంటూ చిందులు తొక్కుతున్నాడు.

పైనున్న ముస్లిం యువకులు కిందికి దిగారు. మొదట చలపతి ఏమంటున్నాడో వాళ్ళకర్థం కాలేదు. తమమీద దొంగతనం నేరం మోపుతున్నాడని తెలిశాక మొదట రోషంతో వాళ్ళూ అరిచారు. తర్వాత దుఃఖంతో "అల్లా కసం. మాకేం తెల్వదు. మేం నిద్రపోయాం. అరుపులకు మెలకువొచ్చింది. అంతే" అన్నారు.

కాసిం చాచా ముందుకొచ్చి, "గాపిలగాళ్ళు ఎసుంటోళ్ళో నాకు బాగా తెలుసు. నేక్ అవుర్ ఈమాన్‌దార్ లడకే.... బేచారే బచ్చే... ఆళ్ళమీద దొంగతనం నేరం మోపటం మహా పాపం. ఖుదా మెచ్చుడు"అన్నాడు.

"తొందరపడకు చలపతీ. పద నువ్వూ నేను కలిసి మరోసారి పైన వెదుకుదాం" అన్నాను. యిద్దరం కలిసి టార్పాలిన్ పైనంతా వెదికాం. అనుమానంతో టార్పాలిన్ ఎత్తి కింద కూడా వెదికాం. దొరకలేదు. మరి పదివేల రూపాయలు ఏమైనట్లు? నాకు అంతుబట్టటం లేదు.

"సార్ నామాట నమ్మండి. ఈ తురకోడే నా పక్కన పడుకున్నాడు. పైనపైన పడ్డాడు. తప్పకుండా వీడే తీసి ఉంటాడు" ఆ ముగ్గురిలో ఒకర్ని చూపిస్తూ అన్నాడు.

"ఆడా ... యా అల్లా ... ఆడు నజీముద్దీన్ ... కష్టపడి సంపాయించే కూలి పైసల్ తప్ప మరేం తాకడు. మేరీ బాత్ మానో బేటా. నజీమ్ అసుంటోడు కాదు" అన్నాడు కాసిం. అతని కళ్ళలో బాధ, అవమానం పోటీలు పడి కన్పిస్తున్నాయి.

నాకు చప్పున దాచేపల్లిలో దిగిపోయిన రౌడీలాంటి శాల్తీ గుర్తొచ్చాడు.

"దిగిపోయాడు చూడు. వాడేమైనా కాజేశాడేమో" అన్నాను.

చలపతి కొద్దిసేపు ఆలోచించాడు.

"లేదు సార్. అతను నా పక్కనే కూచోలేదు. పైకెక్కేటపుడు కూడా నా జేబులో డబ్బులున్నాయి కదా. అతను పైకే రాలేదు. అవకాశమే లేదు. ఈ నజీముద్దీన్ గాడైనా తీసి ఉండాలి లేదా వీళ్ళలో ఒకడైనా తీసి ఉండాలి. అంతే" అన్నాడు.

"యిపుడేం చేద్దామంటావు" చలపతి వైపు తిరిగి అడిగా.

"పోలీస్ స్టేషన్ కెళ్దాం సార్. ఎవ్వర్నీ దింపొద్దు" అన్నాడు.

ఆ మాట వినగానే ముస్లిం యువకుల కళ్ళలో భయం స్పష్టంగా కన్పించింది.

"అంతదాకా దేనికి? యిక్కడే అందర్నీ వెదుకుదాం" అని కాసిం చాచా వైపు తిరిగి "చాచా. ఇదంతా పెద్ద రాద్ధాంతమయ్యేట్లుంది. మీవాళ్ళకు చెప్పు. డబ్బులు తీసుంటే తిరిగిచ్చేయమని చెప్పు. చలపతికి మూడు నెలల జీతమది. కూతురి పుట్టిన రోజుని సంతోషంగా గడుపుకోనీ. చెప్పు మీ కుర్రోళ్ళకి. పోలీస్ కేస్ లేకుండా చలపతికి నేను నచ్చచెప్తాను" అన్నాను.

"నా పిలగాళ్ళ మీద గింత అనుమానం కూడా లేదు బేటా. కావాల్సుంటే నువ్వు సెప్పినట్లు మా నలుగుర్నీ వెదుకు. మదరసాలో మాబిడ్డలకోసం పోగేసిన ఐదొందలు తప్ప మాదగ్గర ఏమీ లేదు" అంటూ తన లుంగీ లోపల నిక్కర్లో దాచుకున్న డబ్బులు తీసి చూపించాడు. అంతా చిల్లర నోట్లు... ఐదు రూపాయలవీ, పది రూపాయలవీ, యాభై రూపాయలవి ... నలిగి పోయిన నోట్లు...

"డబ్బులు ఈ ముగ్గుర్లో ఒకడు కాజేస్తే ముసలోడి దగ్గర ఎందుకుంటాయి?" అన్నాడు చలపతి.

"సరే, రాజూ... వీళ్ళందరి జేబులు వెదుకు" అన్నాను. రాజు ఆ నలుగురు ముస్లింల చొక్కాలు విప్పదీయించి, లుంగీలు విప్పదీయించి వెదకటంతో పాటు సినిమాకెళ్ళొస్తున్న కుర్రాడి జేబులు కూడా వెదికాడు.

ఏమీ దొరకలేదు.

"నన్ను కూడా వెదుకు" అన్నాను. రాజు 'ఏం చేయమంటావ్' అన్నట్లు చలపతి వైపు చూశాడు. ఈ లోపలే నేను జేబులన్నీ బైటికొచ్చేలా లాగి చూపించి "నా దగ్గర ఈ యాభై రూపాయల నోటు తప్ప ఇంకేమీ లేదు" అన్నాను.

"ఎవ్వరూ తీయకపోతే మరి నా పదివేల రూపాయలు ఏమైనట్టు సారూ. నాకు తెలుసు. కచ్చితంగా పైన నాపక్కన పడుకున్న ఈ ముగ్గుర్లోనే దొంగ ఉన్నాడు. పోలీసులకు చెప్తేకాని నిజం బైటికి రాదు" అని అందర్నీ ఎక్కించుకుని మిర్యాలగూడ పోలీస్ స్టేషన్‌కి బయల్దేరాడు.

మధ్యలో సినిమా కుర్రోడు దిగాల్సిన వాడపల్లి వచ్చింది.

"నన్ను వదిలేయండి. మా వూరొచ్చింది. నేను దిగిపోవాలి" అంటూ ఆ కుర్రాడు ఏడుపు లంకించుకున్నాడు.

"రాజు ఆ కుర్రాడిని బాగా వెదికాడు కదా. దానికి తోడు వాడు నీతోపాటు పైకి రాలేదు కూడా. అతన్ని దింపేద్దాం" అన్నాను.

"ఎవర్నీ దింపేది లేదు. ఈ వ్యవహారమంతా పోలీస్ స్టేషన్లోనే తేలాలి" అన్నాడు చలపతి.

మిర్యాలగూడ పోలీస్ స్టేషన్.... సమయం రాత్రి మూడున్నర.

ఎవ్వరూ పారిపోకుండా రాజుని కాపలా ఉంచి నేనూ చలపతి స్టేషన్లోకెళ్ళాం. బెంచీమీద కూచుని సిగరెట్ తాగుతున్న సెంట్రీ టార్చిలైటు మాపైన వేసి

"ఎవరది" అన్నాడు.

"దొంగతనం జరిగింది. రిపోర్టివ్వాలి" అన్నాను. మరో గదిలోకి పిల్చుకెళ్ళాడు. అక్కడో కానిస్టేబుల్ పడుకుని ఉన్నాడు. నేను రిపోర్టు రాసేలోపల అతనూ లేచాడు. చొక్కా తొడుక్కుని, లాఠీ చేతబూని లారీలోని వాళ్ళందర్నీ పిల్చుకొచ్చాడు.

మొదట ఆ నలుగురు ముస్లింలని చొక్కాలు, లుంగీలు విప్పదీసి మరీ వెతికారు. కుర్రాడిని కూడా వదల్లా. రెండో కానిస్టేబుల్ లాఠీకి పని చెప్పాడు.

"అతను వయసులో పెద్దవాడు. కొట్టకు" అన్నాను. అప్పటికే కాసిం వంటిమీద రెండు దెబ్బలు పడ్డాయి.

"రిపోర్టిచ్చేది  మీరే మల్ల కొట్టొద్దనేది మీరేనా? అంతా మీ ఇష్టమైతే ఇక్కడికెందుకొచ్చారు? మీకు తెల్వదు సార్. వీళ్ళు దొంగ నాకొడుకులు. మాటల్తో పన్లు జరగవ్. దెబ్బకు దయ్యం వదుల్తది" అన్నాడు రెండో కానిస్టేబుల్.

"వాడపల్లి బ్రిడ్జి పడ్డాక గుంటూరు దొంగలంతా యిటేపే పడ్తున్నారు. యిదంతా వాళ్ళపనే సార్. మీరు కొద్దిసేపు కళ్ళు, చెవులు మూసుకోండి. నిజంతోపాటు దానమ్మ కూడా బైటికొస్తుంది. చెప్పండ్రా... డబ్బులేమైనాయి ... మీరంతా తోడు దొంగలని నాకు తెలుసు. మర్యాదగా చెప్పండి. లేదంటే ఎముకలు విరిగేలా చావగొడ్తాను" కళ్ళురుముతూ అన్నాడు మొదటి కానిస్టేబుల్.

ఎముకల పోగులా కన్పిస్తున్న కాసిం వైపు చూశాను. కొద్దిగా వణుకుతున్నాడు. అతని పెదవులు అవిశ్రాంతంగా కదుల్తున్నాయి. అల్లాని తల్చుకుంటున్నట్లుంది.

"దొంగ జపం ఆపి నిజం చెప్పు. నువ్వే లీడర్వని నాకు తెలుసు. పదివేలు ఏం చేశారు? మీ వాళ్ళకెవరికైనా రహస్యంగా అందచేశారా"

కాసిం కళ్ళు తెరవలేదు. లాఠీ అతని నడుం మీద పడింది. "యా అల్లా" అని అరిచి మరలా దైవనామస్మరణ కొనసాగించాడు.

మొదటి కానిస్టేబుల్ని కొద్దిగా పక్కకు పిల్చి "అసలే ముసలి ప్రాణం. తగ్రాని

చోట తగిలి హరీ అన్నాడంటే లాకప్ డెత్ కేసవుద్ది. మీ ఇష్టం" అన్నాను. ఆ మాటలు బాగా పని చేశాయి. కాసింని వదిలేసి మిగతావాళ్ళని బాదటం కొనసాగించారు.

"మాకేం తెల్వదు. మేం అసంటోళ్ళం కాదు. సుతారీ పనోళ్ళం. మమ్మల్ని వదిలెయ్యి సారూ" అన్నాడు నజీముద్దీన్.

"ఎలా చెప్తున్నాడో చూసారా ... సుతారీ పనేదో హవల్దారీ పనైనట్లు ... నీయవ్వ దొంగ లెవరో దొరలెవరో మొహంచూసి చెప్పేస్తానొరేయ్. ఖచ్చితంగా నువ్వే దొంగిలించి ఉంటావ్. నీ రక్తంతో పాటు డబ్బులూ కక్కిస్తాను చూడు" వంటిమీద వాతలు తేలేలా లాఠీతో కొట్టాడు. ఒకట్రెండు దెబ్బలు మొఖంమీద తగిలినట్టున్నాయి. నోటి నిండా రక్తం....

అంత రక్తం చూడగానే నజీముద్దీన్ కళ్ళలో చావు భయం కన్పించింది.

"గీ పోలీసోళ్ళు నన్ను సంపేత్తరు. జరూర్‌గా చాచా ... నా సావు తర్వాత నా కొడుకుని నువ్వే సూడాల... ఆడు నోరులేనోడు చాచా ... అయ్యో నా కొడుకో ... ఎట్లా బతుకుతవ్ బేటా" అంటూ సగం మెడకోసి వదిలేసిన కోడిపుంజులా నేలమీద పడి గిజగిజా కొట్టుకుంటున్నాడు ... పొర్లిపొర్లి ఏడుస్తున్నాడు.

మిగతా ఇద్దరూ భయంతో కట్టెలా బిగుసుకు పోయారు.

కాసిం చాచా కళ్ళు తెరవలేదు. ధ్యానంలో ఉన్నట్లు... అతని పెదవులు అల్లా నామ స్మరణ ఆపలేదు.

నేనక్కడ ఉన్న బల్లమీద కూచున్నాను. చలపతి, రాజు ఓ వైపూ మిగతా నలుగురూ మరో వైపు కింద కూచుని ఉన్నారు.

"ఓ పని చేద్దాం సార్. పొద్దుగాల ఎనిమిదింటికి మా ఎస్సై సార్ వస్తాడు. అసలే కోపిష్ఠి. బూటుతో కాళ్ళమధ్య ఎగించి తంతాడు. అంతే... గుడ్లు తేలెయ్యాల" అన్నాడు మొదటి కానిస్టేబుల్.

"నా అనుమానం, ఆ మధ్యలో దిగాడే వాడు కాజేసి ఉంటాడని" రెండో

కానిస్టేబుల్ ఆయాసపడుతూ చెప్పాడు. కొట్టీ కొట్టీ అలసిపోయి నాతోపాటు బెంచీమీద కూచున్నాడు.

“ఇపుడేం చేద్దామంటావు” అన్నాను.

“ఏముంది సార్... జీపొకటి కిరాయికి తీస్కుందాం. ఈ చుట్టుపక్కల వూర్లన్నీ తిరిగొద్దాం. ఆడెవరో ఏంటో కూపీ లాగడానికి ఎంతో సేపు పట్టదు”

“కిరాయి ఎంతవుద్ది” బెరుగ్గా అడిగాడు చలపతి.

“జీపు కిరాయి వెయ్యి... ముగ్గురం పీసీలమొస్తాం. మనిషికో రెండొందలు. సార్‌కో రెండు వేలు. మొత్తం ఐదారు వేలు... అంతే”

చలపతి బుర్ర గోక్కున్నాడు. నాకూ ఆ లెక్క ఏమిటో అర్థం కాలేదు.

“రిపోర్టు చేసినట్లు కాగితం రాసిస్తాం. మీ సేఠ్‌కి చూపిస్తే మరలా నీ జీతం ఇస్తాడు. నువ్వు బేఫికర్‌గుండు” అన్నాడు చలపతి వైపు చూస్తూ.

లేచి మరలా ఆ నలుగురి వైపు నడిచాడు. అందులో ఓ యువకుణ్ణి పక్కకు లాగి పొట్టలో ఈడ్చి తన్నాడు. “అల్లా” అని అరుపు ... పెద్దగా ఏడుపు...మధ్యమధ్యలో సంధి ప్రేలాపనలా మాటలు ... “నాపెల్లాం మాటిని అమ్మీజాన్‌కి బువ్వపెట్టకుండా తరిమేసిన. రంజాన్ రోజు కూడ సూట్టానికి బోలా. అల్లా నాకు శిచ్చ వేసిండు.”

“ఉదయంలోపల సరుకు హైద్రాబాద్ చేరుకోవాలి. నేనిక్కడే ఉంటా . రాజు సరుకు తీసుకుని పట్నం వెళ్తాడు” అలా చేయొచ్చా అన్నట్లు మొదటి కానిస్టేబుల్ వైపు చూశాడు చలపతి. అతను సరే అనగానే రాజుతో పాటు మెల్లగా నేనూ బైటికి జారుకున్నా. లారీ కదిలే లోపల రెండో కానిస్టేబుల్ రయ్యిన పరుగెత్తుకుంటూ వచ్చి లారీకి అడ్డు నిలబడ్డాడు.

“మీరెట్లెల్తరు? వీల్లేదు. మీరే కాజేసి వాళ్ళమీదకి తోస్తున్నారని వాళ్ళంటున్నారు. ఇదంతా సెటిలయ్యేవరకు ఎవ్వరూ కదలడానికి వీల్లేదు”

మేం దిగాం. మళ్ళా స్టేషన్లోకి నడిచాం.

దగ్గర్లో ఎక్కడో మసీదు ఉన్నట్లుంది. ఆజా విన్పించింది. కాసిం లేచి "మసీదుగెట్లెళ్ళాల బేటా" అని మొదటి కానిస్టేబుల్‌నడిగాడు.

"ఎందుకు"

"నమాజ్ సదూకొనొస్తా"

"అట్నుంచటు పారిపోదామని ప్లానా"

"తోబాతోబా ... నేనెందుకు పారిపోతా? నేనేతప్పు సేయలే"

"పోన్లే అతన్ని వదిలెయ్యి. నమాజు చదువుకుని తిరిగొస్తాడు" అన్నాను కల్పించుకుంటూ.

"ఒకడు నమాజ్‌కంటడు. మరొకడు ఉచ్చకంటడు. యింకోడు దొడ్డికంటడు. అందరూ జారుకుంటరు. వీళ్ళని వదిలేదే లేదు" అన్నాడు రెండో పీసీ.

అతనికెలాగోలా సర్ది చెప్పాను. కాసిం నమాజ్ కెళ్ళాడు.

నేను చలపతిని పక్కకు పిల్చుకెళ్ళా."వీళ్ళ వాలకం చూస్తే ఆరేడు వేలు నొక్కేసేట్టున్నారు. నీ పదివేలు దొరికినా అందులో నీకు మిగిలేది రెండు మూడు వేలే. దొరక్కపోతే నీ చేతి ఆముదం వదులుద్ది. కేసొద్దు ఏమొద్దు. రిపోర్టు రాశానే కాని ఇవ్వలా. నాజేబులోనే ఉంది. మనం వెళ్ళిపోదాం" అన్నాను.

"అంతేనంటారా" అన్నాడు బేలగా.

నేనూ, చలపతి, రాజు మెల్లగా బైటపడి లారీ ఎక్కాం. లారీ కదిలే లోపల ట్రైర్లకడ్డంగా కాసిం పడుకున్నాడు. "సాబ్. బేఇన్సాఫ్ మత్ కరో. మమ్మల్ని దొంగలమని లాక్కొచ్చి మీరెట్ల పోతరు సారూ. గీ ఇసయం తేలాల గప్పుడు మీరు బోవాల" అన్నాడు.

మొదటి పీసీ దగ్గరికెళ్ళి"మాకు కేసొద్దు. వాళ్ళను చూస్తే దొంగతనం చేశారనిపించటంలేదు. మేం వెళ్ళిపోతాం" అన్నాను.

"అదెట్ల కుదురుద్ది? రావటం మీ ఇష్టమే పోవటం మీ ఇష్టమేనా? మా ఎస్సై

సాబ్ రావాల" అన్నాడు.

"మీ సార్ వచ్చే వరకూ దేనికి? ఏదో దారి చెప్పు. నీ రుణం ఉంచుకోం"

"ఏముంది సార్... నైట్ డ్యూటీలో నలుగురమున్నాం. రాత్రంతా పని జేసినందుకు మనిషికి మూడొందలైనా గిట్టుబాటు కావాలి కదా. కనీసం వెయ్యి ఇచ్చుకుని మీ దారిన మీరు పొండి"

నైట్ డ్యూటీ చేస్తున్న ఇద్దరు నలుగురెలా ఐనారో అంతు చిక్కకున్నా "నాదగ్గర యాభై రూపాయలున్నాయి. డ్రైవర్ల దగ్గర చిల్లి గవ్వ లేదు. సుతారీ పనోళ్ళ దగ్గర ఐదొందలున్నాయి. కావాలంటే తీసుకో. మమ్మల్ని పోనీయ్" అన్నాను.

కాసిం దగ్గరకెళ్ళి "కాసిం చాచా.. పది వేలు ఎలా పోయాయో మీ అల్లాకే తెలియాలి. ఉదయం యస్సై వస్తే కేస్ పెడ్తాడు. అంతో ఇంతో యిచ్చి ఈ పీడ వదిలించుకోవడమే మంచిది" అన్నాను.

"మేం దొంగలం కాదు బేటా. పైసలెందుకివ్వాల" అన్నాడు కాసిం. మిగతా ముగ్గురూ "జానేదో చాచా. ఈ దెబ్బలు తినలేం. కాలో సెయ్యో ఇరిగితే కూలిక్కూడా పనికిరాం" అన్నారు.

కాసిం చాచా తన దగ్గరున్న ఐదొందలు చలపతికిచ్చాడు. అందులోంచి నాలుగొందలు తీసి మొదటి పీసీకిచ్చాడు. "మా దగ్గర చాయ్ తాగడానిక్కూడా పైసల్లేవు. ఈ వంద మేం ఉంచుకుంటాం. అసలే పది వేలు పోగొట్టుకున్న బాధలో ఉన్నాం కదా" అన్నాడు. రెండో పీసీ కొద్దిసేపు గొణిగి వూర్కున్నాడు.

లారీ దగ్గరకెళ్ళి ఎక్కబోతూ వెనక్కితిరిగి చూశా. కాసిం చాచాని పట్టుకుని మిగతా ముగ్గురు ముస్లిం యువకులూ ఏడుస్తున్నారు. కాసిం చాచా మౌనంలో అనంతమైన విషాదం...

"సార్. మావూరెళ్ళడానికి నా దగ్గర పైసల్లేవు" అన్నాడు పన్నెండేళ్ళ కుర్రాడు. చలపతి తన దగ్గరున్న డబ్బుల్లోంచి పది రూపాయలు తీసి వాడికివ్వబోయాడు.

ఆ కుర్రాడు డబ్బు తీసుకోలేదు. "వద్దుసార్. ఆ పైసలు సాయిబులవి.

అన్యాయంగా వాళ్ళని కొట్టి గుంజుకున్న పైసలు... నేను పోలీసౌతానని చెప్పా కదా... వద్దు సార్... నేను పోలీసు ఉద్యోగం చేయను" అన్నాడు.

★ ★ ★

ఆర్నెల్లు దాటినా నా స్మృతిపథంలోంచి ఆ సంఘటన తొలగిపోలేదు. కాసిం దాదా మౌనం... లాఠీ దెబ్బలకు తాళలేక వాళ్ళరిచిన 'యా అల్లా' అనే అరుపులు... స్టేషన్ నుంచి బైటికొచ్చాక మిగతా ముగ్గురూ కాసింని పట్టుకుని ఏడ్వటం.... హృదయ విదారకమైన దృశ్యం... నన్ను వెంటాడుతూ...

ఓ రోజు అదే విషయం ఆలోచిస్తూ నడుస్తున్నాను. ఒకతను నాకెదురుగా వచ్చి నిలబడి "నమస్తే సార్... బావున్నారా" అంటూ పల్కరించాడు. నేనతన్ని చూడంగానే గుర్తుపట్టాను. "ఏం రాజూ కులాసాయేనా?" అన్నాను.

కుశలప్రశ్నలు ముగిశాక "మీ దోస్తు చలపతి ఎలా ఉన్నాడు? ఆర్నెల్ల క్రితం లారీలో లోడ్ వేసుకుని వస్తూ పదివేలు పోగొట్టుకున్నాడు కదా. ఎలా పోయాయో పాపం" అన్నాను.

రాజు అదోలా నవ్వాడు. "ఎట్టా పోవటం ఏమిటి సార్... కాజేసింది అతనే కదా"

"పోయింది వాడి మూడు నెలల జీతం. వాడి డబ్బు వాడు కాజేయడమేమిటి?"

రాజు నన్ను చూసి ఓ వెర్రి నవ్వు నవ్వాడు. "మీ శిష్యుడు ఆరేడు నెల్లకి మించి ఎక్కడా పని చేయడు సార్. లారీ కిరాయి కాజేశారని స్టేషన్ల రిపోర్టిస్తడు. ఆ కాగితం ఓనర్‌కి చూపించి స్టేషన్ల ఖర్చయిందని పైసల్ గుంజుతడు. జీతం గుంజుతడు."

"మరి ఆ రోజు రిపోర్టు ఇవ్వలేదు కదా. ఆ కాగితం నా జేబులోనే ఉండింది"

"చౌటుప్పల్ దగ్గర ఆపి అక్కడ రిపోర్టు రాసిచ్చిండు. నలుగురు తురకోళ్ళు లారీలో కెక్కి కత్తి చూపించి పైసల్ లాక్కున్నరని"

నా గుండెనెవరో యినుప పిడికిళ్ళతో పిండేస్తున్నట్లు బాధ.... ఆనాటి సంఘటనలోని వ్యక్తులందరూ నా మనోఫలకం మీద మెదిలారు. సమాజాన్ని, మనుషుల్ని నడిపిస్తున్న చోదక శక్తి స్వార్థం కావటం ఎంత దారుణం! వంద తలల్తో విషం కక్కుతోన్న స్వార్థం పడగ నీడలో మానవత్వం మొలకెత్తదు. సమాజం యిలానే కొనసాగితే మంచితనం కోసం ఏ మ్యూజియాల్లో వెతుక్కోవాలో?

మెదడు కుదుళ్ళలో ములుకుల్లా గుచ్చుకుని గాయం చేస్తున్న ఆలోచనల్ని పక్కకు నెడ్తూ  పన్నెండేళ్ళ కుర్రాడి స్మృతి మందానిలంలా... కర్తవ్యం సినిమా చూసి తిరిగొస్తూ లారీ ఎక్కిన కుర్రాడు... వ్యవస్థమీద థూ అని వూసినట్టు చలపతి యివ్వబోయిన డబ్బుని కాదని వెళ్ళిపోయిన ఆ కుర్రాడు భావి తరానికి ప్రతినిధిగా అన్పించి గుండె బరువు మెల్లమెల్లగా సర్దుకుంది. రాజు దగ్గర వీడ్కోలు తీసుకుని, భవిష్యత్తు మీద మొలకెత్తిన ఆశతో ముందుకు కదిలాను.

**(రచన మాసపత్రిక, ఆగస్టు 2006)**

★ ★ ★